ప్రజాశక్తి
గురువారం 30 మే 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

డైవింగ్ సపోర్టు నౌక సీ ట్రయల్స్ సక్సెస్!

త్వరలో నేవీకి అప్పగింత

2029 నాటికి మరో డిఎస్‌వి నిర్మించనున్న షిప్‌యార్డు



ఈ నెల 27వ తేదీన ట్రయల్స్ ప్రారంభిస్తున్న షిప్‌యార్డు అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పూర్తిగా దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో దేశ రక్షణ అవసరాల నిమిత్తం విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డులో నిర్మాణంలో ఉన్న 2 డైవింగ్ సపోర్టు వెస్సెల్ (డిఎస్‌వి)ల్లో నిస్తార్ వెసెల్ ఈనెల 27న షిప్‌యార్డులో విజయవంతంగా సీ ట్రయల్స్ నిర్వహించింది. భారత నౌకాదళానికి త్వరలో దీన్ని అప్పగించేందుకు సీ ట్రయల్స్‌ను షిప్‌యార్డు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సముద్ర జలాల్లో శక్తి సామర్థ్యాలను పరీక్షించిన తర్వాత భారత నౌకాదళానికి దీన్ని అప్పగించాలని అధికారులు భావిస్తున్నారు. ఇండియన్ నేవీలో గల యుద్ధ నౌకలు, సబ్ మెరైన్‌లకు సపోర్టుగా సముద్రంపై ఈ డిఎస్‌విలు సేవలందించేందుకు ఉద్దేశించినవి. నిస్తార్, నిపుణ్ అనే 2 డిఎస్‌విలు హిందుస్థాన్ షిప్‌యార్డుకు గతంలో టెండర్‌లో వచ్చాయి. 1993లో కొరియా సహకారంతో ఐఎన్ఎస్ సుజాత యుద్ధ నౌకను షిప్‌యార్డులో నిర్మించారు. తాజాగా షిప్‌యార్డులో నిస్తార్ పూర్తికాగా నిపుణ్ యుద్ధ నౌక నిర్మాణ ప్రక్రియ నడుస్తోంది. అలాగే 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్ఎస్ఎస్)ల నిర్మాణాన్ని కూడా షిప్‌యార్డు నిర్వహించనుంది. వీటిలో 2 హిందుస్తాన్ షిప్‌యార్డు నిర్మించనుంది.

డిఎస్‌విల ఖర్చు రూ.2000కోట్లు..

డైవింగ్ సపోర్టు షిప్ (డిఎస్‌వి)లతో సుమారు రూ.2000కోట్ల కాంట్రాక్టు గతంలోనే షిప్‌యార్డు టెండరులో దక్కించుకుంది. ఈ షిప్‌ల నిర్మాణంతో షిప్‌యార్డుకు ఆర్థికంగా లాభించకపోయినా శక్తి, సామర్థ్యం నిరూపించుకోడానికి వీటి నిర్మాణాలు దోహదపడతాయని ఉద్యోగులు చెబుతున్నారు. ఎఫ్ఎస్ఎస్‌ల ద్వారానే అత్యధికంగా లాభం రానుంది. కానీ ఈ 5 షిప్‌యార్డుకు దక్కడం లేదు. 1, 4, 5 ఎఫ్ఎస్ఎస్‌లను షిప్‌యార్డు నిర్మించనుంది. 2, 3 ఎఫ్ఎస్ఎస్‌లను ఎల్అండ్‌టి నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 5 ఎఫ్ఎస్ఎస్‌లూ షిప్‌యార్డే చేపడితే సుమారు రూ.19వేల కోట్లు దక్కి ఉండేది.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విశాఖ కలెక్టర్, సిపి తదితరులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా ఫలితాలను వెల్లడించేందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారం అందించేందుకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రాల సమీపంలోనే మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, పబ్లిక్ కమ్యునికేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని వివరించారు. బుధవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ కుమార్ వ్యాస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా పరమైన చర్యలు ఇతర అంశాలపై సమీక్షించారు. పలు అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై, చేపట్టాల్సిన చర్యలపై ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సమర్థవంతంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున మాట్లాడుతూ, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని, నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్ళ ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్‌కు గాను ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంటు, ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నామని, దానికి గాను రెండు హాళ్లను గుర్తించామని, 18 టేబుళ్లను కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరొక 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని పేర్కొన్నారు. జిల్లాలోని అసెంబ్లీలకు వచ్చేసరికి పార్లమెంటుతో

మిగతా 2లో..

భూదోపిడీలపై సమగ్ర విచారణ జరపాలి : లోకనాథం

వార్త మెయిన్‌లో..

లాభాల బాటలో డిసిఐ

వార్త 2లో..

నకిలీ ఉద్యోగ నియామకాలతో మోసపోవద్దు

వార్త 3లో..

ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ఎంఒయు

వార్త 2లో..

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లాలోని అన్ని యూనియన్లు తమ పని ప్రదేశాల్లో పతాకావిష్కరణ జరిపి జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్మిక వర్గ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న సిఐటియు ఆవిర్భవించదని తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు జరిపిందని పేర్కొన్నారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా 18 పారిశ్రామిక సమ్మెలు నిర్వహించిందని తెలిపారు. దేశంలో ఉండే అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటాలు చేయడంలో కీలక పాత్ర పోషించిందని వివరించారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేస్తూ తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న సమయంలో వాటి పరిరక్షణతో పాటు, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం 1200 రోజుల నుంచి సిఐటియు పోరాడుతోందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఉచిత ఇన్సూరెన్స్ తో కూడిన సమగ్ర చట్టం కోసం, ఉద్యోగ భద్రత కోసం, కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి అందరిని పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో సిఐటియు పని చేస్తుందని తెలిపారు. దేశ సమైక్యత సమగ్రత కోసం, లౌకికత్వం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఫెడరలిజాన్ని కాపాడుకునేందుకు నిరంతరం కృషి చేస్తుందని వివరించారు.విశాఖలో 68 రిజిస్టర్ యూనియన్స్‌లో 50 వేల సభ్యత్వంతో బలమైన కార్మిక సంఘంగా ఉందని పేర్కొన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, 10:30 గంటలకు జగదాంబ సిఐటియు కార్యాలయం వద్ద పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు.

రైళ్ల రద్దు, రీషెడ్యూలింగ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని నౌపడ-పుండి సెక్షన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల దృష్ట్యా పలు రైళ్ల రద్దు / రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్వే అధికారులు ప్రకటనలో పేర్కొన్న వివరాలిలావున్నాయి... 07471 పలాస-విశాఖపట్నం ప్యాసింజర్, 07470 విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 31వ తేదీన రద్దుచేశారు.

06090 సంత్రాగచ్చి-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్ సమయం ఈ నెల 30వ తేదీ రాత్రి 23.40 గంటలకు బదులు 3 గంటలు 30 నిమిషాలు ఆలస్యంగా ఈ నెల 31 తెల్లవారుజామున 3.10 గంటలకు సంత్రాగచ్చి నుంచి బయలుదేరుతుంది. 20896 భువనేశ్వర్- రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31వ తేదీన షెడ్యూల్ సమయం 12.10 గంటలకు బదులు 1 గంట ఆలస్యంగా 13.10 గంటలకు భువనేశ్వర్ నుంచి బయలుదేరుతుంది.

06222 ముజఫర్‌పూర్- మైసూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30వ తేదీన షెడ్యూల్ సమయం 13.00 గంటలకు బదులుగా 1 గంట 15 నిమిషాలు ఆలస్యంగా 14.15 గంటలకు ముజఫర్‌పూర్ నుంచి బయలుదేరుతుంది. 06104 దిబ్రూఘర్-న్యూ నాగర్‌కోయిల్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29న షెడ్యూల్ సమయం 19.55 గంటలకు బదులు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 23.55 గంటలకు దిబ్రూఘర్ నుంచి బయలుదేరుతుంది.

ఈ నెల 31, జూన్ 3 తేదీలలో కాంటాబంజీ-తిట్లాగఢ్ విభాగంలో సంబల్పూర్ డివిజన్‌లో వంతెన పునర్నిర్మాణ పనుల కారణంగా 09060 బ్రహ్మపూర్-సూరత్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 31న షెడ్యూల్ సమయం 4.30 గంటలకు బదులు 1గంట 30 గంటలు ఆలస్యంగా 6.00 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరుతుంది. 08528 విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్యాసింజర్ షెడ్యూల్ సమయం 6.30 గంటలకు బదులు ఈ నెల 31న 45 నిమిషాలు , జూన్ 3వ తేదీన 30 నిమిషాలు ఆలస్యంగా విశాఖపట్నం నుంచి బయలుదేరుతుంది. ప్రయాణికులు మార్పులను గమనించి తమ ప్రయాణాలను రైళ్ల వేళలకు అనుకూలంగా మార్చుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

మొదటి పేజీ తరువాయి..

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు

కలిపే అన్ని ఏర్పాట్లు చేశామని అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరొక మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని వివరించారు. అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు గాను ఐదు హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుందని వెల్లడించారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి తొలి విడత శిక్షణ అందించామని, ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని, జూన్ 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

140 సున్నిత ప్రాంతాలను గుర్తించాం : పోలీస్ కమిషనర్

జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ చెప్పారు. జిల్లాలో 140 సున్నిత ప్రాంతాలను గుర్తించామని అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇప్పటి నుంచే పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థుల ఇళ్లను కూడా గుర్తించామని అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు. నగర పరిధిలో జరిగే అన్ని సంఘటనలను పర్యవేక్షించేందుకు అనుగుణంగా ఎక్కడిక్కడ సీసీ టీవీలు అమర్చామని వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని వివరించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఏడీసీ కెఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు.

సిఎస్ జవహర్‌రెడ్డి నిబద్ధతను నిరూపించుకోవాలి : పల్లా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తన నిజాయితీని నిరూపించుకోవాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే, కూటమి గాజువాక అసెంబ్లీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎస్ జవహర్‌రెడ్డిపై, అతని కుమారుడిపైనా సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శాఖాపరంగా కూడా దర్యాప్తు చేయాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు పరిసరాల్లో ఉన్న అసైన్డ్ భూములను కొట్టేయాలనే ఆలోచన దుర్మార్గమన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బ్యూరోక్రసీ కూడా దోపిడీలకు పాల్పడం ఘోరం అన్నారు. జిల్లా స్థాయి అధికారులు కూడా దీనిపై వివరణ ఇవ్వాలన్నారు. జగనన్న కాలనీల పేరుతో అసైన్డ్ లాండ్స్ డేటా పూర్తిగా తీసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. డేటాలో ఉన్న ప్రకారం దళారులతో అగ్రిమెంట్లు ఎవరు చేసుకున్నారో తెలుసుకుని వారికే ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు ఇచ్చారని చెప్పారు. జిఒ వచ్చిన పది రోజుల్లోనే రిజిస్ట్రేషన్లు చకచకా జరిగిపోవడం ఆశ్చర్యకరమైన విషయం అన్నారు. 596 జిఒ ఇచ్చాక ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్లు ఎవరికి ఇచ్చారో మొత్తం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే భూ ఆక్రమణలపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాజమండ్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనులు నత్తనడకపై నిలదీత

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడం పట్ల నిరసన తెలుపుతూ మత్స్యకార సంఘాల నాయకులు బుధవారం మత్స్యశాఖ అధికారులతో తీవ్రస్థాయిలో వాగ్యుద్ధానికి దిగారు. ఆంధ్రప్రదేశ్ మేకనైజేడు బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యాన కొందరు మత్స్యకార సంఘాల నాయకులు మత్స్యశాఖ కార్యాలయానికి వెళ్లి ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి అంశంపై ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోడీ కొబ్బరికాయ కొట్టినా విశాఖ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయని నిలదీశారు. పోర్టు, మత్స్యశాఖ అధికారులు మత్స్యకారుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేయడంతో అధికారులు ఎదురు తిరిగారు. దీంతో అధికారులు, మత్స్యకారులు మధ్య వాగ్వాదం జరిగింది. ముందస్తు చర్యలు తీసుకోకుండా చేపల వేలం కేంద్రం తొలగించి నిర్మాణాలు చేపట్టిన పోర్ట్ అధికారుల నిర్వాకం వల్ల బోటు యజమానులు, మత్స్యకారులకు భవిష్యత్తులో కోట్ల రూపాయలు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని జానకిరామ్ డిమాండ్ చేశారు. 3వ సంవత్సరం నడుస్తున్నా 30 శాతం కూడా అభివృద్ధి పనులు పూర్తి కాలేదన్నారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున సమక్షంలో సంవత్సరంలో పనులు పూర్తి చేస్తామని చెప్పి పోర్టు అధికారులు మాట తప్పారన్నారు.

లాభాల బాటలో డిసిఐ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 2023-24తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి రూ.35.68 కోట్ల లాభాలను అర్జించిందని సంస్థ బుధవారం ఒక ప్రకటన విడుదలచేసింది. సంస్థ ప్రకటనలో పేర్కొన్న వివరాలిలావున్నాయి... గత ఆర్థిక ఏడాది 2022-23లో సాధించిన రూ.15.18 కోట్ల లాభంతో పోల్చినప్పుడు లాభదాయకతలో వృద్ధి నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.945.50 కోట్ల టర్నోవర్‌తో 147 శాతం బలమైన వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచన కంటే ముందు ఆదాయాలు రూ. 224.40 కోట్లు సంస్థ వద్ద ఉన్నాయి. ఇది గత ఆర్థిక సంవత్సరం 2022-23తో పోల్చితే 81.36 శాతం పెరుగుదల. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రతి షేరుకు రూ.69.13 ఉన్న ఈపిఎస్‌కు వ్యతిరేకంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి (ఈపిఎస్) రూ.12.27 వద్ద పునరుద్ధరించబడింది.

ఆర్థిక సంవత్సరం 2023-24 లో అనేక ముఖ్యమైన డ్రెడ్జింగ్ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేయడం డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదాయ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడింది. కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌లో సుమారు రూ. 800 కోట్ల వ్యయంతో ట్రైలర్ సక్షన్ హాప్పర్ డ్రెడ్జర్ నిర్మాణంలో ఉంది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి 2024-25కు రికార్డు స్థాయిలో అత్యధికంగా రూ.1840 కోట్ల టర్నోవర్‌ని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది.

సమస్త జీవరాశిని కాపాడే బాధ్యత మానవాళిదే

కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ రమేష్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భూగోళం మీద సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనని ఎపి కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజినీర్ కె.రమేష్ అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రచారం "మన భూమి" అనే అంశంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నేపథ్యం (థీమ్)- భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తిపై దృష్టి సారిస్తుందని ఐక్యరాజ్యసమితి పేర్కొందన్నారు. ఈ ఏడాది నినాదం 'మా భూమి, మన భవిష్యత్తు, మేము, మా తరం భూమి పునరుద్ధరణ'అని వివరించారు.

కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి ముకుందరావు మాట్లాడుతూ, ప్రతి ఏటా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఐక్యరాజ్యసమితి సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, పర్యావరణ కోణాల మీద పురోగతిని ప్రోత్సహించడానికి ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి విశాఖ నగరంలో విభిన్న అవగాహన కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తుందని వివరించారు. అనకాపల్లి, మన్యం జిల్లాల్లోనూ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఎఎస్ఆర్‌సి మూర్తి, ఎపిపిసిబి ప్రతినిధులు ఇఇ కరుణరేఖ, ఎఇ శ్రీలక్ష్మి, సైంటిఫిక్ ఆఫీసర్ సంయుక్త, రీసెర్చ్ అసోసియేట్ గౌతమి, సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం తదితరులు మాట్లాడారు.

ఈవీ ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ఎంఒయు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశపు ఈవీ ఛార్జింగ్ మౌలికసదుపాయాన్ని మెరుగుపరిచే క్రమంలో తమ వ్యూహాత్మకమైన భాగస్వామ్యాన్ని ఎంజీ మోటార్ ఇండియా, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) ప్రకటించాయి. ఈ ఒప్పందంలో భాగంగా, ఎంజీ ఇండియా - హెచ్‌పిసిఎల్ కలిసి 50 కెడబ్ల్యు, 60 కెడబ్ల్యు డిసీ ఫాస్ట్ ఛార్జర్లను నగరంలోనూ, జాతీయ రహదారులపై కీలకమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తాయి. సిసిఎస్-2 ఛార్జింగ్ స్టాండర్డ్‌తో అనుకూలంగా అన్ని ఈవీల కోసం ఛార్జర్లు పబ్లిక్-మోడ్ నెట్ వర్క్ రూపొందించారు. ఈ ఛార్జింగ్ స్టేషన్స్ లభ్యత మైఎంజీ యాప్ పై ఎంజీ కస్టమర్లకు లభిస్తాయి. హెచ్‌పిసిఎల్ నెట్ వర్క్ డిస్కవరీ సాధనం ద్వారా కూడా తెలుసుకోవచ్చు. నగరంలోని ప్రముఖ హోటల్‌లో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ గ్రోత్ ఆఫీసర్ గౌరవ్ గుప్తా, హెచ్‌పిసిఎల్ హైవే రీటైలింగ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజ్ దీప్ ఘోష్ పాల్గొన్నారు



ఎంఒయు మార్చుకుంటున్న అధికారులు

'వైసిపి భూ దాహానికి వనరులన్నీ నాశనం'

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో వైసిపి నాయకుల భూ దాహానికి రాష్ట్రంలోని వనరులన్ని నాశనమయ్యాయని ఎపి బిజెపి ముఖ్య అధికారప్రతినిధి లంకా దినకర్ ఆరోపించారు. బుధవారం ఉదయం లా సన్స్ బే కాలనీ లోని బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో భూదోపిడీ రెండు రకాలుగా జరిగిందన్నారు ఒకటి ప్రాజెక్టుల పేరుతో, రెండోది వైసిపి నాయకుల ప్రోద్బలంతో భూకబ్జాలు, బెదిరించి తక్కువ ధరకు లాగేసుకోవడం, డిపట్టా భూములు సొంతం చేసుకోవడం, అక్రమ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు ద్వారా దోపిడీ జరిగిందని వివరించారు. భూదోపిడీపై సత్వర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టుల కోసం దాదాపు నాలుగు లక్షల ఎకరాలను రాష్ట్రవ్యాప్తంగా దోచేయడానికి జగన్ అస్మదీయులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఆరోపించారు. విశాఖపట్టణంలో రాష్ట్ర సిఎస్ తనయునిపై 800 ఎకరాల అసైన్డ్, డిపట్టా భూముల స్కాం ఆరోపణలు రావడం దౌర్భాగ్యమని, గడచిన కొన్ని నెలలుగా భూములకు అనుసంధానం అయిన వెబ్‌సైట్లు పని చేస్తున్న విధానం వెనుక భారీ భూదోపిడీ ఉందని అర్థం అవుతుందని పేర్కొన్నారు.

PUBLIC NOTICE

My client Telu Venkata Jaya Prabha, W/o. Rajanala Gowri Shankar, D/o. Telu Devaraju (Late), Hindu, aged 49 years, residing at D.No.43-5-45(9), 2nd Floor, Sri Siddhi Enclave-4, Srikanya Theater Back Side, Railway New Colony, Visakhapatnam-530 016 is the absolute owner of the below schedule mentioned property acquired by her by way of inheritance, after the demise of her father Telu Devaraju.

Public are hereby informing that one person by name Pentapalli Lova Venkata Rajasekhar, S/o.Late Gurumurthi is intending to sell my schedule mentione property without having any right, title, interest over the said property by suppressing the real facts and the said property is in Court Dispute O.S.1537/2023 on the file of V Additional Junior Civil Judge Court at Visakhapatnam and another case O.S. 192/2023 on the file of I Additional Junior Civil Judge Court at Visakhapatnam as such any person is trying to purchase, mortgage, my client's below schedule mentioned property from Pentapalli Lova Venkata Rajasekhar, such Sale Transaction is voide and the Sale Deed should be cancelled and not binding on my client and who purchase the said property all are punished according to law.

SCHEDULE

All that piece of land in an extent of 52 Sq. Yds. or 43.47 Sq. Mts. of undivided and unspecified share out of total extent of 444 Sq. Yds. or 371.24 Sq. Mts. together with R.C.C. Slabbed House in Ground Floor, Flat No.G1 measuring 1105 sft. Bearing D.No.43-14-29 with Old Assessment No.55796 and New Assessment No. 1086195575 in super built up plinth area (South East Corner) in Residential Unit in Block No.20, covered by T.S.No.320, T.P.No.5/59, situated at Railway New Colony, Visakhapatnam which is within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam and S.R.O., Visakhapatnam is bounded as follows:

East : House bearing D.No.43-14-28 belongs to A. Venkateswarlu
South : Compound Wall belongs to Oruganti Venkata Reddy
West : Doctor Palanki Manga Rao Residency
North : 33 feet wide Road

POLINAIDU VUDAMALA, Advocate
Block No.V, Flat No.5RA, J.K. Modern Homes
Anthony Nagar, Visakhapatnam-530 002. Cell: 9966631486

మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, శ్రీకాకుళం

O.S.102/2023

Between :
తోలాపి క్రిష్ణకుమారి ... వాది
And
దండి రాజేంద్రదేవ్ వగైరాలు ... ప్రతివాదులు
To
1) కాయల వెంకటరెడ్డి, s/o సత్తిరెడ్డి, కె.వి.ఆర్. ఎస్టేట్, విశాఖపట్నం అర్బన్, సీతమ్మధార, విశాఖపట్నం జిల్లా.

పైన ఉదహరించిన దావా O.S.102/2023 మీ పై కోర్టులో మీ హాజరు నిమిత్తము తేది 01-07-2024 కి ఉన్నది. మీరు వ్యక్తిగతముగా కానీ మీ తరపున వకీలు ద్వారా కానీ పై కోర్టులో తే 01-07-2024 న ఉదయం గం॥ 10-30 ని॥లకు హాజరు అయ్యి మీ యొక్క వాదనను స్టేట్‌మెంట్‌తో సహా పై కోర్టు వారికి తెలుపుకోవలెను. పైన చెప్పబడిన తేదిన మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు పై వాజ్యమును కోర్టువారు విచారణ చేసి తీర్మానించుటమగునని మీరు తెలుసుకోవలసినది.

M.H.G.L.N. RAJU, ADVOCATE
SRIKAKULAM.
Cell : 9866734380

IN THE HONOURABLE COURT OF IInd ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.P. 142 / 2023 O.S. 896 / 15

Between:
P.Satyarao (died) & Others ... DHrs
And:
Y.Sarojini & Others ... JDRs

NOTICE

JDR-1: Y.Sarojini, W/o. Late Ganiraju, D.No. 13-471, Arilova, Visakhapatnam
JDR-2: Y.Tataji, S/o. Late Ganiraju, -Rest Do-
JDR-4: Y.Divya Swaroopa, D/o. Late Ganiraju, -Rest Do-

పై నెంబరు అమలును Send for the attachment amount నిమిత్తం దాఖలు చెయ్యగా యిందలి JDR 1,2 & 4 అయిన మీకు రూలు 22 నోటీసు మీకు ఎన్నిసార్లు పంపించిననూ మీకు చేరని కారణంగా యీ ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే:11-7-2024దీకి** వాయిదా అయివున్నది. కావున **తే:11-7-2024దీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు కేసును మీ పరోక్షమందు తీర్మాణించడమగును.

(By Court)
M.CHINNAYYA
V.ADITYA
Advocates,
Visakhapatnam.
Visakhapatnam.
Dt. 29-5-24
Cell : 98483 73615

పోలీసులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య తనిఖీలను పర్యవేక్షిస్తున్న సిఐ రామకృష్ణ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ సిబ్బందికి బుధవారంఆక్సిలేట్ ల్యాబ్స్ సహకారంతో వైద్యఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానిక సిఐ వై.రామకృష్ణ పర్యవేక్షించారు. పిఎంపాలెంలో 155 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నగర పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న లోకల్ పోలీసులతోపాటు ఆర్మ్డ్ రిజర్వ్, హోంగార్డ్సులకు నగర పోలీస్‌కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ కృషితో, ఆక్సిలేట్ ల్యాబ్ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఆక్సిలేట్ ల్యాబ్ డైరెక్టర్ పిసిఎం రాజు మాట్లాడుతూ గుండెకు సంబంధించి ఇసిజి, లిక్విడ్ ప్రొఫైల్, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, థైరాయిడ్, మధుమేహ పరీక్షలు, యూరిన్ ఎనాలసిస్‌తో కలిపి సుమారు 60 రకాల పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ సురేష్, టెక్నీషియన్లు భవాని, ఇందుప్రియ, నరేష్, రాజు పాల్గొన్నారు

2న 'దర్శిని' విజయోత్సవ సభ

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరానికి చెందిన వికాస్, శాంతి హీరోహీరోయిన్లుగా, డాక్టర్ అల్లు ప్రదీప్ దర్శక పర్యవేక్షణలో, వి4 క్రియేషన్స్ పతాకంపై, డాక్టర్ ఎల్‌వి. సూర్యం నిర్మించిన దర్శిని చిత్రం రెండు వారాల క్రితంఉభయ తెలుగు రాష్ట్రాల్లో, 100కు పైగా థియేటర్లో విడుదలై, అమిత ప్రేక్షకాదరణ పొందిన నేపథ్యంలో వచ్చేనెల 2న ఆదివారం మధ్యాహ్నం, 2గంటలకు స్థానిక పౌరగ్రంథాలయంలో విజయోత్సవ అభినందన సభ నిర్వహించనున్నట్లు రంగ స్థాయి ప్రతినిధి, వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు. బాదంగిరి సాయి తెలిపారు. 'మేకింగ్ దర్శిని మూవీ' పేరిట ఉచిత చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. విశాఖకు చెందిన చిత్ర హీరోహీరోయిన్లు, దర్శకుడితోపాటు సాంకేతిక వర్గాన్ని అభినందించి, సత్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్టార్ మేకర్ యల్.సత్యానంద్, నగర ప్రముఖులు పాల్గొంటారని, సినీ ప్రియులు, ఔత్సాహిక దర్శకులు, నిర్మాతలు, సినీనటులు, ప్రేక్షకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని లోడగల వానిపాలెం పంచాయితీ భూలోకమాత గుడి శ్రమజీవుల కాలనీకి పక్కా పైపులైన్ వేసి ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. తాత్కాలిక పైపులైన్‌తో బోరు నుంచి డైరెక్టుగా నీటి సరఫరా చేయడం, ఇటీవల రోడ్డు డ్రైనేజీ పనుల సమయంలో తాత్కాలిక పైపులైన్ పాడవ్వడంతో రెండు రోజులుగా తాగునీటికి ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది మళ్లీ తాత్కాలిక పైపులైన్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాకు సిద్ధపడుతోంది. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఏర్పాటు కాకుండా, ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీలతోపాటు పైపులైన్ పనులు జరుగుతుండడంతో, పనిలో పనిగా భూలోకమాత గుడి శ్రమజీవుల కాలనీకి ప్రత్యేకంగా పైపులైన్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా ఇంటింటికీ కుళాయిలను బిగించి, శాశ్వతప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై అధికారులు, నేతలు దృష్టి పెట్టాలని వేడుకుంటున్నారు.



జరుగుతున్న పైపులైన్ పనులు

ఆటోను ఢీకొట్టిన లారీ

పలువురు చిన్నారులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని భీమిలి క్రాస్ రోడ్డు వద్ద ఆటోను లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 12 మందిలో 8 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుసులవాడ గ్రామానికి చెందిన వీరంతా జూపార్క్, బీచ్ మరికొన్ని పర్యటక ప్రాంతాలను చూసేందుకు ఆటోలో వెళ్తుండగా, భీమిలి క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి వెనుక నుండి వచ్చిన లారీ ఆటోను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో మూడు ఫల్టీలు కొట్టి రోడ్డు పక్కకు పడిపోయింది. ఆటోలోనుంచి ఎగిరి, రోడ్డుపై పడిన దాసరి దిలీప్, చింతాడ. అనిల్‌లకు తల, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. పైడితల్లి, రవ్వ, రమణ, జస్వంత్, సుబ్రహ్మణ్యం, శోభ గణేష్, నాగమణిలకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ సంతోష్ సిబ్బంది చేరుకొని క్షతగాతులను అంబులెన్స్ లో గాయత్రి ఆసుపత్రికి చికిత్సకు తరలించారు. కేసు నమోదు చేసి, అనందపురం సిఐ టివి.తిరుపతిరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నటుల ఎస్ఐ సంతోష్ తెలిపారు.

పైపులైన్ పనుల్లో అత్యుత్సాహం!

కోడ్‌ను తుంగలో తొక్కి చకచకా 'రాంకీ' పనులు

జివిఎంసి అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం



రాత్రికిరాత్రే చకాచకా రాంకీ పైపులైన్ పనులు

ప్రజాశక్తి-పెందుర్తి :పేదవాడికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలంటే, ఎన్నికల కోడ్, ఇతరత్రా సవాలక్ష కారణాలు చెప్పే జివిఎంసి యంత్రాంగం, రాంకీ పైపులైన్‌కు సంబంధించిన పనులను మాత్రం ఎటువంటి సాకులు చెప్పకుండా రేయింబవళ్లు పనులు చేయడంపై స్థానికులు ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జివిఎంసి 88వ వార్డు గవర జగ్గయ్యపాలెం ప్రాంతంలో రాంకీ సంస్థ చేపట్టిన ప్రాజెక్టుకు రాత్రికిరాత్రే యుద్ధప్రాతిపదికన పైపులైన్లు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కొన్ని పత్రికల్లో వార్తలు రావడం, స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో కొద్దిరోజుల పాటు పనులను నిలుపుదల చేసి, ఇంతలోనే చకచకా పనులు చేసేస్తున్నారు. సామాన్యులను తాగునీరు అందించేందుకు గానీ, తాగునీటికి సంబంధించి సమస్య పరిష్కారానికి గానీ మీనమేషాలు లెక్కించే జివిఎంసి యంత్రాంగం, రాంకీ సంస్థ పనుల్లో చూపుతున్న అత్యుత్సాహం విస్మయానికి గురిచేస్తోంది. కాగా, జివిఎంసిఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అధికారుల తీరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ఆ ప్రాంత జనసేన నాయకులు అంటున్నారు.

నకిలీ ఉద్యోగ నియామకాలతో మోసపోవద్దు

ప్రజాశక్తి - సీతమ్మధార : విద్యుత్ శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని, నకిలీ నియామక పత్రాలతో మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీన్ని నిరుద్యోగులు నమ్మవద్దని ఎపిఇపిడిసిఎల్, హెచ్ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ ప్రస్తుతం ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని స్పష్టం చేసారు. ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడితే సంస్థ వెబ్‌సైట్‌లోనూ, ప్రముఖ తెలుగు, ఆంగ్ల దినపత్రికలలోనూ ఉద్యోగ ప్రకటన నోటిఫికేషన్‌ను ప్రచురించి, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నియామకాలు నిర్వహిస్తామన్నారు.

సబ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు ప్రాతిపదికన నిర్వహించేందుకు కాంట్రాక్టర్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంటుందని, అందులో పనిచేసే సిబ్బందితో కానీ, వారి నియామక ప్రక్రియతో కానీ ఎపిఇపిడిసిఎల్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసారు.

సంస్థ పేరున నియామక పత్రాలను జారీకి కాంట్రాక్టర్లకు ఎటువంటి అనుమతి లేదన్నారు. అయినప్పటికీ విద్యుత్ సబ్ స్టేషన్లలోకాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు నకిలీ నియామక పత్రాలను ఇచ్చి మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎపిఇపిడిసిఎల్‌లో ఉద్యోగ నియామకాల కోసం www.apeasternpower.com వెబ్‌సైట్‌న ుగానీ, సంస్థ కార్పొరేట్ కార్యాలయంలోని హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ సిజిఎంను నేరుగా సంప్రందించి వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు గుర్తింపు



పెందుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు వలందపేట, నమ్మివానిపేట గ్రామాల్లో ఎంఇఒ ఎం, శివరాణి, భవిత కేంద్రం ఐఇఆర్‌టి, కె జియాకుమారి బుధవారం పర్యటించి 18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. మానసిక వైకల్యం, చెవుడు, మూగ, అంధత్వం, చలన వైకల్యం గల వారిని గుర్తించి దగ్గర్లో ఉన్న పాఠశాలలో పేర్లు నమోదు చేయిస్తామని ఎంఇఒ ఎం శివ రాణి తెలిపారు. గుర్తించిన పిల్లలను భవిత కేంద్రానికి పంపించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఇప్పటివరకు మండల పరిధిలో 40 మందిని గుర్తించామని, వచ్చేనెల 9వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి ఈ తరహా పిల్లలను గుర్తిస్తామని తెలిపారు.

పెందుర్తి :సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు, ఎపిసి బి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే చేస్తున్నారు. బుధవారం పెందుర్తిలో చేపట్టిన వికలాంగ పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ సువర్ణ, ఎంఇఒ టి.మధుమూర్తి పర్యవేక్షించారు. మండలంలో ఇప్పటివరకు 30మంది పిల్లలను గుర్తించామని, వారందరికీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విద్య, ఇతర ప్రయోజనాలను కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు బిఎవి నాగేశ్వరరావు, శాంతి పాల్గొన్నారు. సంబంధిత నివేదికను రాష్ట్ర అధికారులకు నివేదిస్తామని జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.గీత తెలిపారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : తల్లి మందలించిందన్న మనస్తాపంతో బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఏడో వార్డు వాంబే కాలనీ ఎంబ్లాక్ జిఎఫ్ 5లో అన్నపూర్ణ తన కుటుంబ సభ్యులతో నివాసముంటోంది. ఆమె భర్త మృతి చెందాడు. తన కుమార్తె సోనాలిక (14) తరుచూ సెల్‌ఫోన్ చూస్తుండటాన్ని గమనించిన తల్లి, కుమార్తెను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సోనాలిక, మంగళవారం తల్లి ఇంట్లో లేనిసమయంలో ఇంట్లోనే ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి భీమునిపట్నం: అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు జివిఎంసి ఒకటో వార్డు చిట్టి వలసలో పోలీసులు దాడుల చేశారు. బుధవారం జరిపిన ఆకస్మిక దాడుల్లో అదే ప్రాంతానికి చెందిన బైరెడ్ల రాంబాబు నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న ట్లు ఎస్ఐబి, సిఐ వి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు నిందితుడు రాంబాబుపై కేసు నమోదు చేసికోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై కిశోర బాలికలు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం రుతుక్రమ ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా రైల్వే న్యూకాలనీ యుపిహెచ్‌సి వద్ద ఆర్‌బిఎస్‌కె సమన్వయకర్త డాక్టర్ ఎన్.సమత ఆద్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ రుతుక్రమమనేది మహిళలలో జరిగే సాదారణ ప్రక్రియ అని, దీనిపై లేనిపోని అపోహలు, ఆంక్షలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. అయితే ఆ సమయంలో పరిశుభ్రతపై కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బి.నాగేశ్వర రావు, రైల్వే న్యూ కాలనీ యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దివ్య, ఆర్‌బిఎస్‌కె కన్సల్టెంట్ డాక్టర్ హీనా దీక్షిత్, కౌన్సెలర్ ఆర్.సత్యవతి, డిఇఐసి మేనేజర్ శాంతిప్రియ, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం, ఎఎన్ఎంలు, ఆశాలు, కిశోర బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేళాపాళాలేని విద్యుత్ కోతలు

ప్రజాశక్తి- పెందుర్తి : వేళాపాళాలేని విద్యుత్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మూడు రోజులుగా భానుడు భగభగలాడుతూ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికి విద్యుత్ కోతలు తోడవ్వడంతో ప్రజలు ఇంటా బయటా ఎక్కడా నిలవలేని పరిస్థితి ఉంది. జివిఎంసి 92,93 వార్డుల పరిధిలో ఉన్న వెంకటసాయినగర్, నాయుడు కాలనీ, బంటా కాలనీ ప్రాంతాల్లో మూడు రోజులుగా విద్యుత్ కోతలు మరింత తీవ్రమయ్యాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎంతసేపు ఉంటుందో తెలియని పరిస్థితుల్లో అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.విద్యుత్ కోతలపై సంబంధిత శాఖాధికారులు కనీసం ముందస్తు ప్రకటన కూడా ఇవ్వకపోవడంతో ప్రజల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లోని పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఎండవేడిమి నుంచి ఉపశమనానికి ఐస్‌క్రీం, జ్యూస్‌సెంటర్లకు వెళదామంటే కరెంట్ లేకపోవడంతో వారూ మూసుకుని కూర్చునే పరిస్థితి ఉంది. విద్యుత్ కోతలపై స్పష్టమైన ప్రకటన జారీ చేయడంతోపాటు వీలైనంత వరకు అప్రకటిత విద్యుత్ కోతలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వాంబే కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 65వ వార్డు, వాంబే కాలనీలో సిపి రవిశంకర్ ఆదేశాల మేరకు సౌత్ ఎసిపి త్రినాథ్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగ వాంబేకాలనీలో విస్తృత తనిఖీలు నిర్వహించి, సరైన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎన్నికల ఫలితాల వెల్లడి తర్వాత ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, సదస్సు, బాణసంచా కాల్చడం పూర్తి నిషేధమన్నారుడిసిపి మేకా సత్తిబాబు, సిఐ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారునికి ఆర్థిక ప్రోత్సాహం


అభిషేక్ కు రూ 5వేలు చెక్కును అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : కరాటేలో ప్రతిభ కనబర్చిన స్థానిక నేరెళ్ళవలస కాలనీకి చెందిన కోలా అభిషేక్‌కు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి బుధవారం రూ 5వేలు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఇప్పటికే కరాటే పోటీల్లో 8 పతకాలు సాధించిన పదేళ్ల అభిషేక్ జాతీయ స్థాయిలో జరగ నున్న కరాటే పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహకంగా ఈ సాయం చెక్కును అందజేసినట్లు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు

బాధిత కుటుంబానికి పరామర్శ


కృష్ణారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైసిపి నేత కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇటీవల మరణించిన 50వ వార్డు వైసిపి సీనియర్ నాయకులు, జెసిఎస్ మండల అధ్యక్షులు పైడి కృష్ణారావు మాస్టారు కుటుంబ సభ్యులను ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు బుధవారం పరామర్శించారు. కృష్ణారావు మాస్టారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు కృష్ణారావు మాస్టారు వైసిపి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ఆయన సేవలను మరువలేమన్నారు. మాస్టారు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీనిచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యాన మందిరాన్ని సందర్శించిన ముత్తంశెట్టి


ధ్యాన మందిరంలో బ్రహ్మకుమారీలతో ముత్తంశెట్టి దంపతులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : రాజస్థాన్‌లో ప్రసిద్ధి గాంచిన మౌంట్‌అబూలోని బ్రహ్మ కుమారీల ధ్యానమందిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అతని సతీమణి జ్ఞానేశ్వరి దంపతులు బుధవారం సందర్శించారు. ధ్యాన కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ మృత్యుంజయ భాయ్‌ని కలిశారు

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : స్థానిక మధురవాడ సబ్ స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతులు కారణంగా ఈనెల 31న, శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ డిఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. వుడా కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం, మధురవాడ ఫీడర్ల పరిధిలోని పోర్ట్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, వాంబే కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, గాయత్రీ హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ,మధురవాడ మెయిన్ రోడ్, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, చంద్రం పాలెం, భాస్కర్ నగర్, సంపత్ నగర్,మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

హమాలీల మధ్య చిచ్చు పెట్టొద్దు

- గంభీరం పౌరసరఫరాల గొడౌన్ వద్ద కళాసీల ఆందోళన


గంభీరం గిడ్డంగి వద్ద ఆందోళన చేస్తున్న హమాలీలు

ప్రజాశక్తి -ఆనందపురం: మర్రిపాలెం డిపోకు చెందిన హమాలీలను గంభీరం గొడౌన్‌లో పనికి తెచ్చి, వారి మధ్య చిచ్చుపెట్టడం అధికారులకు తగదని సిఐటియు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మండిపడ్డారు. బుధవారం గంభీరం పౌర సరఫరాల గొడౌన్ వద్ద హమాలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ గొడౌన్ అధికారుల చర్యలను ఖండించారు. ఒక ప్రాంత కూలీలను వేరేచోట పనికి పురమాయించినప్పుడు ముందుగా కార్మిక సంఘాలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులకు లేదాయని ప్రశ్నించారు. దీనిపై కార్మిక సంఘాలను ఏకం చేసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా ఆనందపురం మండలం గంభీరం పౌరసరఫరాల గోడౌన్‌లో 105 డిపోల రేషన్ సరుకుల ఎగుమతి, దిగుమతులకు 16 మంది హమాలీలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ డిపోలో పరిధిలోని 105 డిపోలకు గాను ఆరింటిని పద్మనాభం, పెందుర్తి, మర్రిపాలెం గొడౌన్లకు బదలాయించి, మర్రిపాలెం గొడౌన్ పరిధిలోని 25 డిపోలను గంభీరం గిడ్డంగిలో విలీనం చేశారు. డిపోల సంఖ్య పెరడంతో తమకు ఎక్కువ వేతనం వస్తుందని గంభీరంలోని హమీలీలు ఆనందం వ్యక్తం చేశారు.అయితే అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై, ఈ నెల 25న మర్రిపాలెం హమాలీలతో కోర్టులో కేసు వేయించి, విలీనమైన 25డిపోల సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్‌కు మర్రిపాలెం డిపో కళాసీలు చేసుకోవచ్చంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారంతా బుధవారం పనిలోకి రాగా, గంభీరం కూలీలు అడ్డుకున్నారు. ఒక గిడ్డంగి పరిధిలోని హమాలీలు, వేరే గొడౌన్‌కు వచ్చి పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. కొత్త సంప్రదాయానికి తెరతీసిన అధికారుల చర్యలను నిరసించారు.

దీనిపై సివిల్ సప్లరు డిఎం ఐ.రాజేశ్వరిని గంభీరం హమాలీలు నిలదీయగా, కోర్టు ఆదేశాల మేరకు మర్రిపాలెం కళాసీలు వచ్చి పనిచేస్తున్నారని, వారిని అడ్డుకునే హక్కు లేదని బెదిరించారని వారంతా వాపోతున్నారు. పోలీసుల భద్రత పెట్టి, వేరే గొడౌన్ కళాసీలను పనిలోకి పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గంభీరం గిడ్డంగి హమాలీల మేస్త్రి పోతురాజు మాట్లాడుతూ తమ గిడ్డంగిలో వేరే ప్రాంత హమాలీలతో పనిచేయించడం ఎంత మాత్రం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థులు పరిశోధనాసక్తిని పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ రామారావు

ప్రజాశక్తి- గాజువాక : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభోధన సాగించడంతోపాటు విభిన్న అంశాలపై పరిశోధనలపై ఆసక్తిని పెంచుకోవాలని ఎంవిఆర్ పీజీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి రామారావు అన్నారు. బుధవారం రామచంద్ర నగర్‌లోని ఎంవిఆర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కరస్పాండెంట్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ,. వస్తున్న మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ అవుతూ, విభిన్న రంగాల్లో రాణించి, పోటీప్రపంచంలో నిలదొక్కుకుని భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలని సూచించారు. కెమిస్ట్రీ విభాగాధిపతి వై ఈశ్వరరాజు మాట్లాడుతూ, విద్యార్థులు సమయపాలన పాటించాలని, తాము చదువుతున్న సబ్జెక్టులపై విషయ పరిజ్ఞానం పెంచుకుని, పట్టు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. .

1న గిరిజన గురుకులాల్లో ప్రవేశాలు

ప్రజాశక్తి-మధురవాడ : సిబిఎస్ఇ సిలబస్‌లో విద్యాబోధన సాగుతున్న విశాఖ, మారికవలసలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎంపికైన విద్యార్థులంతా జూన్ ఒకటో తేదీన ప్రవేశాలు పొందాలని పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు. ఒకటిన శనివారం ఉదయం 10 గంటల నుండి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థులకు ఫోన్, కాల్ లెటర్స్ ద్వారా సమాచారం పంపామన్నారు. ఎంపికైన విద్యార్థులంతా అర్హత ధ్రువీకరణలతో ప్రవేశాలకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు పాడేరు ఐటిడిఎలోని గురుకులం సెల్‌లో నోటీస్ బోర్డులో తెలుసుకోవచ్చన్నారు. అదనపు సమాచారం కొరకు 9502956307, 9490957232 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ ఏడాది నుంచి మారికవలస గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో సిబిఎస్ఇ విధానంలో విద్యాబోధన సాగుతుందని ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు.

31న సత్యనారాయణ ఉద్యోగ విరమణ


కూన సత్యనారాయణ, పార్వతి దంపతులు

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం పోర్టు అథారిటీలో లస్కర్ గ్రేడ్-1 గా విధులు నిర్వర్తిస్తున్న కూన సత్యనారాయణ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయ్యనున్నారు. 1964, మే 16న మాధవధార ప్రాంతంలో కూన అప్పన్న, లక్ష్మీనారాయణమ్మ దంపతులకు జన్మించిన సత్యనారాయణ, ఒకటో తరగతి నుండి 10వ తరగతి వరకు మాధవధార మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్నారు. 1981-82లో కార్పొరేటర్ ట్రేడ్‌లో ఐటిఐ పూర్తి చేసారు. 1983-85లో ఆంధ్రాయూనివర్సిటీలో పియుసి పూర్తి చేసి, 1986 -89లో ఎవిఎన్ కళాశాలలో డిగ్రీ చదివారు. 1990లో విశాఖపట్నం పోర్టులో ఉద్యోగంలో చేరగా, 1992లో డిసి డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గ్రేడ్-2గా పర్మినెంట్ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు గ్రేడ్-1 లస్కర్‌గా ఉద్యోగ విరమణ చెయ్యనున్నారు.

సిఐటియు, డివైఎఫ్ఐలో చురుకైన పాత్ర

1990లో సిఐటియు సభ్యులుగా చేరిన సత్యనారాయణ, అనేక ఉద్యోమాలలో చురుగ్గా పాల్గొన్నారు. అప్పటి 41వ వార్డు ప్రస్తుతం 50,51 వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ, ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి తనవంతు కృషిగా అప్పట్లోనే 200 మందిని పాఠకులను చేర్పించారు. 200 నవశక్తి నెలవారీ పత్రికలకు చందాదారులుగా యువతను చేర్పించారు. 1985లో డివైఎఫ్ఐలో సభ్యులుగా చేరి 1998 వరకు సిపిఎం నాయకులు సనపల రామ్‌గోపాల్‌తో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొని, కీలకపాత్ర పోషించారు. దాదాపు వెయ్యి మంది యువతను డివైఎఫ్ఐలో చేర్పించారు. 1996 అక్టోబర్ 25న మాధవధారలోని శ్రీ మాధవ యువజన సమాజం ఆవరణలో మహిళా సంఘం నాయకురాలు పార్వతిని అదర్శ వివాహం చేసుకున్నారు.

పోర్టులో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పలు కార్మిక సమస్యలపై పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలలో పాలొంగన్నారు. పోర్టు బెర్తులు, ఒ.హెచ్‌సి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించారు. పోర్టులో సీక్రెట్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించాలని మూడు వేల మంది కార్మికుల సంతకాలను సేకరించి, షిప్పింగ్ చైర్మన్, సెక్రటరీలకు పలుమార్లు మెమొరాండం సమర్పించారు. బెర్తుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కరపత్రాల ప్రచారం, సంతకాల సేకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు యాజమాన్యం కక్షసాధింపుగా 2003 మే 15న 5నెలల 20రోజులు విధులు నుంచి సస్పెండ్ చేశారు.

యునైటెడ్ పోర్ట్స్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారిగానూ, ప్రస్తుతం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ప్రస్తుతం ఆఫీస్ బేరర్‌గా వ్యహరిస్తున్నారు. ఒక ప్రక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, స్థానిక, ప్రజాసమస్యలపై ఉద్యమాల్లో పాల్గొనేవారు. విద్యుత్ ఛార్జీల పెంపుదల, నిత్యావసరాల ధరలను నియంత్రించాలని ఇలా ఎన్నో ఉద్యమాల్లో ముందుండి పాల్గొన్నారు. 2010 నుంచి 50,51 వార్డుల వార్డు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బిపిఎస్ భారాలపై పోరాటాలు చేశారు. ఇంటిపన్నులు, చెత్తపన్నులు, కరెంట్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ పలు ఉద్యమాలు నిర్వహించారు.

సత్యనారాయణ సతీమణి పార్వతి మాధవధారలో ఐద్వా కార్యదర్శిగా, కంచరపాలెం డివిజన్ కమిటీ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఐద్వా సంఘం అభివృద్ధికి సభ్యులను చేర్పించడంతోపాటు, విరాళాల సేకరణలో పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై అనేక పోరాటాలలో ముఖ్యపాత్ర పోషించారు. సత్యనారాయణ, పార్వతి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కూన ఉదయ్ బిటెక్ మెకానికల్ పూర్తి చేశారు. కుమార్తె బిటెక్, ఎంబిఎ చదివింది. ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజాశక్తితో కూన సత్యనారాయణ ప్రత్యేకంగా మాట్లాడుతూ, రిటైరైన తర్వాత కూడా ప్రజల మధ్యనే ఉంటూ, స్థానిక సమస్యలపై పనిచేస్తానన్నారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని, అందుకు అధికారులందరూ సమాయత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పేర్కొన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలన్నారు. జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన శిక్షణ సదస్సులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభానికి 5 రోజులే గడువు ఉందని, ఓట్ల లెక్కింపు విధానంలో అనుసరించాల్సిన విధి విధానాలపై మార్గనిర్దేశనం చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియ గురించి, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అక్కడ అనుసరించే విధానాలు, సంప్రదాయాల గురించి సూక్ష్మంగా వివరించాలని చెప్పారు. ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా ఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని, సమయ స్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ అంతా పూర్తి పారదర్శక విధానంలో, పూర్తి స్థాయి పర్యవేక్షణలో జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు సమయంలో బెల్ ఇంజనీర్లు అందుబాటులో ఉంటారని, ఏమైనా అనుకోని విధంగా సాంకేతిక సమస్యలు వస్తే కంగారు పడొద్దని వారి సహాయం తీసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎమ్ఎస్ లెక్కింపు సమయంలో సంయమనం పాటించాలని, అత్యంత జాగ్రత్తగా ఉండాలని చిన్నపాటి తప్పిదాలు కూడా జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానాలపై, పద్ధతులపై క్షుణ్ణంగా వివరించారు. నివేదికలు తయారీలో, ఫలితాల వెల్లడిలో అనుసరించాల్సిన పద్ధతులపై తెలియజేశారు. ఈ క్రమంలో అధికారుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

డిగ్రీ ఫలితాల్లో సాయి కుల్వంత్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇటీవల విడుదలైన ఆంధ్ర యూనివర్సిటీ డిగ్రీ ఫలితాల్లో అనకాపల్లి సాయి కుల్వంత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బీబీఏ ఫలితాల్లో సాయి కుల్వంత్ కళాశాలకు చెందిన కలగా శ్యామల, కాళ్ళ కావ్య శ్రీ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో నేమాలి వంశిక జిల్లాలో ద్వితీయ స్థానం సాధించారు. బిఎస్సీలో కుందల దుర్గ పూజిత కళాశాల ప్రథమ స్థానం సాధించింది. తమ విద్యార్థులు సాధించిన ప్రగతి పట్ల కళాశాల కరస్పాండెంట్ ఎం కామరాజు, అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు అభినందించారు.


బిబిఎ ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన కలగా శ్యామల

నేడు జోన్ 2, 3లోని పలు ప్రాంతాలకు తాగునీటి అంతరాయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తాగునీటి విభాగం నగర పరిధిలోని టిఎస్సార్ ప్రాంగణంలోని కొమ్మాది పంపుహౌస్‌కు సంబంధించి పంపుసెట్టు మరమ్మత్తులు కారణంగా జోన్ 2, 3లలో పలు ప్రాంతాలకు గురువారం తాగునీటికి అంతరాయం కలుగుతుందని జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు కెవిఎన్.రవి బుధవారం తెలియజేశారు. రెండవ జోన్ పరిధిలోని చినగదిలి, పెదగదిలి, సూర్యతేజ నగర్, గాంధీనగర్, బాలాజీనగర్, ఆదర్శనగర్, హనుమంతవాక, 10వ వార్డు సంబంధించి అన్ని ప్రాంతాలకు, 3వ జోన్ పరిధిలో చిన్న వాల్తేర్, పెద్ద వాల్తేర్, ఆదర్శనగర్ ఎంవిపి సెక్టర్ 8, 11 మొదలగు ప్రాంతాలకు తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. అత్యవసరం అయిన ప్రదేశాలలో నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు.

నా గెలుపు ఖాయం : వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాను 30 వేల నుంచి 50 వేల మెజారిటీతో గెలుస్తానని దక్షిణ నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. శివాజీపాలెంలోని వంశీకృష్ణ శ్రీనివాస్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైసిపికి ఓటమి తప్పదన్నారు. కూటమికి 130 నుంచి 150 స్థానాలు రావడం ఖాయమని చెప్పారు. తాను ఓడిపోతాని ఒక వర్గం మీడియా దుష్ప్రచారం చేయటాన్ని ఖండిస్తున్నానన్నారు. తాను ఖచ్చితంగా గెలుస్తానని, ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని, ఒక వేళ గెలిస్తే మీ మీడియా సంస్థలు మూసివేస్తారా అని ప్రశ్నించారు.


మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు

మిడ్డేమీల్స్ నిర్వాహకులకు శిక్షణ


ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మధ్యాహ్న భోజన తయారీపై బుధవారం మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిఎంఎఫ్ కోఆర్డినేటర్ పి.అచ్యుతరావు మాట్లాడుతూ నాణ్యత గల, రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని సూచించారు. సోమవారం నుండి శనివారం వరకు మెనూ ప్రకారం అందజేయవలసిన పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో గునూరు వరలక్ష్మి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. బి.ఎ.రాజు, సీఆర్ పి శ్రీను, సాయి, వివిధ పాఠశాలలకు చెందిన భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

వైవి.సుబ్బారెడ్డిని కలిసిన భరత్‌కుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి

రాజ్యసభ సభ్యులు, వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి బుధవారం విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ విశాఖపట్నం విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ నాయకులున్నారు.


సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భరత్‌కుమార్

పైపులైన్ల మరమ్మతులతో

వృథాగా పోతున్న తాగునీరు


నేతవానిపాలెం గ్రామంలో వృథాగా పోతున్న మంచినీరు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తాగునీరు వృథా చేయొద్దని ప్రభుత్వం ప్రచారాలు చేసినా, ఆచరణలో అదెక్కడా కానరావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రం బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురై వారం రోజులుగా రక్షిత తాగునీరు యథేచ్ఛగా రోడ్డుపై వృథాగా పోతుంది. దీంతో కుళాయిల నుండి నీరు రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచారంలో తాగునీరు వృథాగా పోతున్నా దానిని అరికట్టేందుకు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుత వేసవికాలంలో నీటి కొరత మెండుగా ఉన్నప్పటికీ ఇలా నీరు వృథా అవుతున్న అధికారులు పట్టించు కోకవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్లను సరిచేసి, తాగునీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండల కేంద్రం బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో వీధిలైట్లు పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. ఆరు ఏడు నెలలుగా నేతవానిపాలెం గ్రామంలోని మెయిన్ రోడ్డు బీసీ కాలనీలో వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయి. స్విచ్ కంట్రోల్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు మాత్రమే ఆరిపోతుంటాయి. ఒకవైపు విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంది. ఈ సమయంలో అనవసరంగా విద్యుత్ ఖర్చు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

గొన్న కళాశాలలో జాబ్ అచీవర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని ఏడుమెట్ల మర్రిపాలెంలోని గొన్న కళాశాలలో డిప్లమో విభాగంలో జాబ్ అచీవర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2021-24 బ్యాచ్ డిప్లమా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపస్ డ్రైవ్‌లో జాబ్ వచ్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ వివిధ కంపెనీలలో తమ డిప్లమా విద్యార్థులు ఎంపిక కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు వారి జీవితంలో మరిన్ని సాధించేలా ప్రేరేపించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థిని, ఆమె తండ్రిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ అధికారులు

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 3వ రోజు 167 మంది హాజరు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలీసెట్ కౌన్సిలింగ్ మూడో రోజు బుధవారం కొనసాగింది. మొత్తం 167 మంది హాజరు కాగా వారి ధ్రువపత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేసినట్టు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఐవిఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 116 మంది బాలురు, 51 మంది బాలికలు ఉన్నారన్నారు. కాగా నాలుగో రోజు గురువారం కూడా కౌన్సిలింగ్ కొనసాగుతుందని ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు తమ ధ్రువ పత్రాలను తీసుకొని హాజరుకావాలని తెలిపారు.



అనకాపల్లి డిఎస్‌పిని కలిసిన ప్రజాసంఘాల నాయకులు

పోలీసులకు ప్రజా సంఘాల ఐక్య వేదిక అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించేందుకు కృషి చేసిన డిఎస్‌పికి, పోలీసులకు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఐక్యవేదిక నాయకులు బుధవారం అనకాపల్లి డివిజనల్ డీఎస్పీ కార్యాలయంలో డిఎస్‌పి అప్పలరాజును కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలలో సైతం చెదురు మొదురు సంఘటన కూడా జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించి శాంతి భద్రతల పరిరక్షించడం అభినందనీయమన్నారు. జూన్ 4న జరగబోవు ఎన్నికల కౌంటింగ్‌కి కట్టుదిట్టమైన భద్రతలు ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ళ ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవిందరాజు, ముగడా అప్పారావు, రావి దేవుళ్ళు, సరిసా చిరంజీవి, ఉప్పల సాయి, బొడ్డు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్లు భర్తీకి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కశింకోట

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యంలో నడపబడుచున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో బుధవారం ఉదయం 10 నుండి సాయంత్రం 5గంటల వరకు స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా పరిధిలోని 7 బాలికల గురుకుల (తాళ్లపాలెం, కోనాం, నక్కపల్లి, నర్సీపట్నం, కొక్కిరాపల్లి, మెఘాద్రిగడ్డ, మధురవాడ) పాఠశాలల్లో 5వ తరగతిలో మిగులు సీట్లను భర్తీ ఈ కౌన్సిలింగ్ జరిగింది. రూల్ అఫ్ రిజర్వేషన్ అనుగుణంగా మొత్తం 108 సీట్లు భర్తీ చేసినట్లు గురుకులాల ఉమ్మడి జిల్లాల సమన్వయాధికారి యస్. రూపావతి, కమిటీ మెంబెర్స్ జి.గ్రేస్, మల్ల మాణిక్యం తెలిపారు.



విద్యార్థినికి జాయినింగ్ పత్రం అందిస్తున్న అధికారులు

ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలి

సిఐటియు నేతలు వివి.శ్రీనివాసరావు, బ్రహ్మాజీ

ప్రజాశక్తి-మునగపాక

గ్రామీణ పేదలకు పనులు కలిపిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాదికి 100 రోజుల నుండి 200 పని దినాలకు పెంచాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీలు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక పూరిటి గెడ్డ కాలువలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలను బుధవారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పనులు లేక ఉపాధి కరువై అల్లాడుతున్న పేదలకు గ్రామీణ ఉపాధి హామీ పథకం కల్పతరువుగా ఉందని చెప్పారు. గ్రామీణ పేదలు వలసల నివారణకు, వారి కుటుంబాల్లో కనీస పోషణకు ఉపాధి పనులు ఎంతో మేలు చేస్తున్నాయని చెప్పారు. వామపక్ష పార్టీల కృషితో వచ్చిన ఈ పథకం నేడు ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. అటువంటి ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం నిధులు పెంచడంతోపాటు, ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పనిముట్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.600 రోజు కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసరావు, బ్రహ్మాజీ

కశింకోట : మండల కేంద్రం కసింకోట శారదా నదిని ఆనుకొని వెదురుపర్తి రోడ్డులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు బుధవారం సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేస్తున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. వారంలో ఐదు రోజులు మాత్రమే మస్తరు వేస్తూ మిగతా రెండు రోజులు గురువారం, ఆదివారం పనిచేసినప్పటికీ కూలి డబ్బులు ఇవ్వడం లేదని కూలీలు తెలిపారు. కొంతమందికి వారానికి వెయ్యి రూపాయలు, కొంతమందికి 1200 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఎంత పని చేస్తున్నామో తెలియజేసే పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విషయాలు పైకి తెలిపితే పనిలోకి రాకుండా ఆపేస్తారేమోనని కూలీలు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, వరలక్ష్మి, కోటమ్మ, సత్యవతి ,రాములమ్మ, పార్వతి, నాగమ్మ, చిన్నమ్మలు, కాంతమ్మ, వెంకటి తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బీచ్‌లో మహిళను కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి జోన్-2 పరిధిలో ఆర్థిక సమస్యల కారణంగా చంటి బిడ్డతో సహా జోడుగుళ్లపాలెం బీచ్‌లో దూకిన మహిళలను జివిఎంసి లైఫ్ గార్డ్ జి.అప్పలరాజు కాపాడారని అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. జోడుగుళ్లపాలెం బీచ్‌లో ఎన్.దుర్గాభవాని (27) తన పది నెలల చంటి బిడ్డతో సహా బీచ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంటున్న ఆమెను, నిత్యం నిఘాలో ఉంటూ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్ రక్షించారని అదనపు కమిషనర్ తెలిపారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మద్యం సేవించి చాలామంది బీచ్‌లో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఎటువంటి సమస్యలైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని ఆయన హితవు పలికారు.



కాపాడిన మహిళతో లైఫ్ గార్డులు

స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యాన నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు పురుషులు, మహిళలు అర్హులని తెలిపారు. మూడు నెలలు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ, ఉచితంగా భోజనం, వసతి, యూనిఫామ్, బుక్స్, ఎసి క్యాంపస్ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పాసైన యువతీయువకులు బిఎస్సీ, డిప్లమా పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు తమ సంస్థ నందు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు బొల్లినేని మెడ్ స్కిల్స్, జెమ్స్ మెడికల్ స్కూల్, హాస్పిటల్ క్యాంపస్, లేదా 7680945357, 9121999654 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెంజెరువు నిర్వహణ కరువు

- చెరువు నిండక గతేడాది ఖరీఫ్‌కు నష్టం
- ఈ ఏడాదీ ముందుస్తు చర్యలు చేపట్టని వైనం



మరమ్మతులకు నోచుకోని పెంజెరువు ఇదే...

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి పరిధిలోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెంజెరువు నిర్వహణను ఇరిగేషన్ శాఖ గాలికొదిలేసింది. శారద నది నుండి కాలువ ద్వారా పెంజెరువులోకి నీరు వస్తుంది. ఈ చెరువు కింద 200 హెక్టార్లు ఆయకట్టు ఉంది. అయితే పంట కాలువ పూడిక తీయకపోవడం, శారద నది ఆయకట్టు వద్ద ఇసుక మేటలు అడ్డు తొలగించకపోవడంతో పంట కాలువ నుండి పూర్తి స్థాయిలో నీరు ప్రవహించకపోవడంతో గతేడాది పెంజెరువులోకి నీరు చేరలేదు. పెంజెరువు నిండకపోవడంతో గతేడాది 200 హెక్టార్లలో ఖరీఫ్ పంట దెబ్బతిన్నది. ఆయకట్టు రైతులు పూర్తిగా నష్టపోయారు. ఈ అనుభవాన్ని రైతులు నాడే స్థానిక జలవనరుల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిధుల కొరత కారణంగా గతేడాది మరమ్మతు పనులు చేపట్టలేకపోయామని, వచ్చే ఏడాదికి ముందస్తుగా ఎస్టిమెట్స్ పంపిస్తామని చెప్పారు. కాని మరో మూడు వారాల్లో ఖరీఫ్ సమీపిస్తున్నా ఇప్పటి వరకు కాలువ పూడిక తీతగాని, ఇసుక మేటలు తొలగించే పనిగాని, ఇతర చెరువు నిర్వహణ పనులుగాని చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది కూడా రైతులు ఖరీఫ్ పంట భారాన్ని వరుణుడి మీద వేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జలవనరులశాఖ అధికారులు పెంజెరువు నిర్వహణపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

కొసమెరువు : పెంజెరువులో చేపలు పెంపకానికి ప్రతి ఏటా వేలం పాట నిర్వహిస్తున్నారు. గతేడాది చేపల పెంపకానికి వేలం పాట రూ.6 లక్షలకు పాడారు. అయితే ఆ డబ్బులు స్థానిక పంచాయతీ వాడుకుంటుంది. చెరువు నిర్వహణకు ఖర్చు చేయడం లేదు.

నిధులు లేక పనులు చేపట్టలేకపోతున్నాం



జలవనరులు శాఖ వద్ద నిధులు లేక ఏ పనులూ చేపట్టలేకపోతున్నాం. పెంజెరువు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుండి తిరిగి మాకు సమాధానం రాలేదు. నిధులు రానిదే మేము ఎటువంటి పనులూ చేపట్టలేం.

- శివరామప్రసాద్, జలవనరుల శాఖ ఎఇ

నిప్పుల కొలిమి



కృష్ణదేవిపేటలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు



నక్కపల్లిలో చీర కొంగును కప్పుకుని నడిచి వెళుతున్న మహిళలు

ప్రజాశక్తి -గొలుగొండ:రోహిణి కార్తెలో కాస్తున్న ఎండలకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత రెండు రోజులుగా గొలుగొండ మండలంలో భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. దీంతో ఉదయం 10 గంటలకే ప్రజలు ఇళ్లకు చేరుతున్నారు. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోత మరింత ఎక్కువై ఎవరూ బయటకు రాలేదు. దీంతో మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

నక్కపల్లి:గత రెండు మూడు రోజుల నుండి భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.ఎండ దెబ్బకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడి, ఉక్క పోతకు జనం విలవిలలాడుతున్నారు. బుధవారం ఉదయం 7 నుండే భానుడు ఎండ వేడితో విరుచుకుపడ్డాడు. 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రోహిణి కార్తీ ప్రారంభం నుండే అత్యధిక వేడి గాలులు వీచడం ప్రారంభమయ్యాయి. వడగాలులకు, ఉక్కపోత తోడవడంతో వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఇళ్లల్లో ఫ్యాన్ వేసుకున్నప్పటికీ వేడి గాలులు వీయడంతో ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కార్మికుల బాధలు వర్ణనాతీతం. భవన నిర్మాణ కార్మికులు , కూలీలు ఎండ దెబ్బకు సొమ్మసెల్లి పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఎండలో పనిచేయడంతో ఎండ దెబ్బకు గురవుతున్నారు. ప్రయాణాలు సాగించేవారు ప్రయాణం చేసేందుకు హడలిపోతున్నారు. ముఖ్యంగా బైక్ పై ప్రయాణం సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడ ఆగుతూ, జ్యూస్ పాయింట్ ల వద్ద చల్లటి పానీయాలు సేవించి, ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. మహిళలు చీర కొంగులను నెత్తిన కప్పుకుని నడక సాగిస్తున్నారు. సాయంత్రం అయినా వేడి తగ్గక పోవడంతో జనం ఎండ దెబ్బకు తల్లడిల్లుతున్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ

మెనూను అమలు చేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖ అధికారి టి.రామారావు తెలిపారు. బుధవారం మండల సమావేశం మందిరంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల యుటిఎఫ్ అధ్యక్షులు నరసింగరావు నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

వూషు సెలక్షన్స్‌లో 14 మంది ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:జిల్లా స్థాయి వూషు సెలక్షన్స్‌లో 14 మంది సెలక్ట్ అయ్యారు. అందులో గొలుగొండ, మాకవరపాలెం, తుని, చెట్టుపల్లి, నర్సీపట్నం, అనకాపల్లి నుండి 37 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలు నర్సీపట్నం మినీ స్టేడియంలో ఉదయం 6 గంటల నుండి నిర్వహించారు. మహిళల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరిలో జరిగింది. ఇందులో మొదటి స్థానాలలో ఉన్న 14 మంది విజేతలను ఫైనల్‌గా సౌత్ జోన్ నేషనల్ కర్ణాటక పంపిస్తారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. ఈ పోటీలకు రిఫరీగా వూషు ఎన్ఐఎస్ కోచ్ వేపాడ ప్రియాంక నిర్వహించినట్లు చెప్పారు. వెయిట్ బరువు బాలికలు 27 కేజీల నుండి 66 కేజీలలో మాత్రమే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నింజాస్ అకాడమీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ వెలగా జగన్నాథ్, పి.శ్రీనివాస్, వెలగా నారాయణరావు, జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆఫ్ అల్లాడ చారిటుల్ ట్రస్ట్ అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్ శాప్ కోచ్ అబ్బు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహించారు. బుధవారం ఈ వెరిఫికేషన్‌లో బాగంగా 27001 ర్యాంకు నుండి 43000 ర్యాంకు వరకు మొత్తం 99 మంది విద్యార్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసినట్లు ప్రిన్సిపాల్ రావంచంద్రరావు తెలిపారు. గురువారం 43001 ర్యాంకు నుండి 59000 ర్యాంకు వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేస్తామని చెప్పారు.



హాజరైన విద్యార్థులు

బాణం దెబ్బకు గిరిజనుడు బలి

ప్రజాశక్తి- చింతపల్లి : బాణం వేసి గిరిజనుడిని హతమార్చిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పెదకొండ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఉపాధి హామీ పనులు చేసుకుంటున్న వంతల సొనియా (53)పై అదే గ్రామానికి చెందిన కాకూరి బాబ్జి బాణంతో దాడి చేశాడు. గుండెలపై బాణం గుచ్చుకోవడంతో వంతల సొనియా అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దాడి చేసిన బాబ్జి పరారయ్యాడు. సొనియా కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతపల్లి ఆసుపత్రికి పోలీసులు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.



బాణం తగిలి మృతిచెందిన సొనియా

విద్యార్థులకు విజ్ఞానదాయక పోటీలు



కోటవురట్లలో కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కే.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు కుట్లు, అల్లికలపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ వెలగా దేవి కుట్లు, అల్లికలను విద్యార్థులకు నేర్పించారు.

నక్కపల్లిలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు గాంధీజీ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కోటవురట్ల: చిన్నారులు ప్రత్యేకంగా నీతి కథలపై దృష్టి పెట్టాలని గ్రంథాలయాలు అధికారి అప్పలనాయుడు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి రోజు గ్రంథాలయాలను సందర్శించి విలువలతో కూడిన నీతి కథలు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగాపురం గ్రామ కార్యదర్శి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయధికారిని పి.దమయంతి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. కొమరవోలు జెడ్పీహెచ్ఎస్ ఎస్ఎ(సోషల్) రాంకుమార్ విద్యార్థులకు గ్రంథాలయాల ప్రయోజనాలపై డిబేట్ నిర్వహించారు. అనంతరం చిన్న పిల్లలకు కదల పోటీలను నిర్వహించారు.బలిఘట్టం జెడ్పీహెచ్ఎస్ క్రాఫ్ట్ ఉపాధ్యాయిని రాజేశ్వరి పేపర్స్‌తో ఫ్లవర్స్ తయారు చేయించారు.

గొలుగొండ:గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రాజుబాబు సూచించారు. విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, మ్యూజికల్ చైర్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్, కథల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయ అధికారి మహేష్, పలువురు పాఠకులు పాల్గొన్నారు.



భీమిలిలో...



గొలుగొండలో...

ములగాడ : మహిళలు అన్నిరంగాల్లో ముందుంటే, సమగ్ర అభివృద్ధి సాధ్యమని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 'మహిళా సాధికారత'పై సీనియర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీని, జూనియర్ విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరక్షరాస్యత, చైతన్యలేమి, పితృస్వామిక వ్యవస్థ, వరకట్నం, లైంగిక వివక్షత మొదలైన కారణాలతో మహిళలు వెనకబడి ఉన్నారని, వీటిని తొలగించడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్, రచయిత కె.సత్తిరాజు పాల్గొన్నారు.

12మంది ఆర్ఎంపిలకు నోటీసులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురంలో ఆర్ఎంపి క్లినిక్ కేంద్రాలను బుధవారం కృష్ణదేవిపేట పిహెచ్‌సి వైద్యాధికారి హరిప్రవీణ్ తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. శిక్షణ పొందిన మేరకే వైద్యం అందించాలని సూచనలు చేసి నోటీసులు జారీ చేశారు. సుమారు 12 మంది ఆర్ఎంపి వైద్యులకు నోటీసులు అందజేశారు. పరిధికి మించివైద్య సేవలు అందించకూడదని, ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని ఆయన తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.



తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి

31న విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ:132 కెవి పాయకరావుపేట - పెద్దాపురం లైన్‌లో మరమ్మత్తుల కారణంగా ఈ నెల 31న పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ వివి.రామకృష్ణారావు తెలిపారు. ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు పెదబొడ్డేపల్లి, రోలుగుంట, గబ్బాడ, ఏటిగైరంపేట, బలిఘట్టం, గొలుగొండ, కేడిపేట, నాతవరం, గొలుగొండపేట, గన్నవరం, కోటవురట్ల, వెంకటాపురం, పాములవాక 33/11 కెవి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

అరకులో రైలా యూత్ లీడర్‌షిప్ సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇంటరాక్ట్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసి ఆఫ్ విసిసి), రోటరీ క్లబ్ విశాఖపట్నం, ఇతర రోటరీ క్లబ్బులు, వ్యక్తులు, సంస్థల సహకారంతో రోటరీ యూత్ లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం (రైలా) సమ్మర్ క్యాంప్‌ను అరకువ్యాలీలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించినట్లు విసిసి జిల్లా కన్వీనర్ కె. సుశీల తెలిపారు. విశాఖ జిల్లా నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. శారదానికేతన్ స్కూల్‌లో క్యాంపు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. 4 రోజుల్లో మొదటి రోజు విశాఖ నుంచి బయలుదేరి బొర్రా గుహలను సందర్శించినట్లు తెలిపారు. మొదటిసారి బొర్రా గుహలను చూసిన విద్యార్థులు ఆ అద్భుతాన్ని చూసి ఆశ్చర్య పడుతూ ప్రకృతి తనలో అనేకమైన రహస్యాలను దాచి వుంచుకుంటుందని అనుకున్నారన్నారు. 2వ రోజు విద్యార్థులు చదువులో, ఆలోచనలో, ఆచరణలో ఏ విధంగా ఆలోచించాలి, మంచి ఏది చెడు ఏది, ఎందుకు ఎలా వస్తుంది? అనే అంశాలను తెలియజేస్తూ శాస్త్రీయ ఆలోచన అంశాన్ని బోధించినట్లు చెప్పారు. అనంతరం స్వాతంత్రోద్యమం ప్రాముఖ్యత, దానిలో విద్యార్థుల పాత్ర, నాయకత్వం వహించిన విద్యార్థుల జీవిత చరిత్రలు, దాని నుంచి నేటి తరం నేర్చుకోవాల్సిన అంశాలను వివరించినట్లు తెలిపారు. సినిమా జీవితం, నిజ జీవితం ఏ విధంగా ఉంటుందో సినిమా నుంచి మంచిని ఏ విధంగా తీసుకోవాలి, అసభ్యకర అలవాట్లు సినిమా నుంచి తీసుకోకూడదని, సమాజం కోసం చేసిన సినిమాలు వాటిపై చర్చ జరిగినట్లు వివరించారు. వచ్చిన విద్యార్థులను 10 బృందాలుగా చేసి ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, నిరుద్యోగం, తాగుడు మత్తు, సోషల్ మీడియా, పర్యావరణ విధ్వంసం, డిగ్నిటీ ఆఫ్ లేబర్ సమస్యలపై స్కిట్ వేశారన్నారు. రాత్రి గిరిజన మహిళలు విద్యార్థులందరికీ నృత్యం నేర్పిస్తూ, అడుగులో అడుగు వేసుకుంటూ మొత్తం విద్యార్థులందరూ కూడా బృందాలుగా థింసా నృత్యం నేర్చుకున్నట్లు తెలిపారు.

3వ రోజు ఉదయాన్నే 7 గిరిజన గ్రామాల సందర్శనకు నడుచుకొని వెళ్లినట్లు చెప్పారు. 1 నుంచి 4 కిలోమీటర్ల ప్రకృతి మధ్యలో నడవడం కొత్త అనుభవం. గిరిజన గ్రామాలు వారి జీవన విధానం గ్రామాల్లో వారికున్న సౌకర్యాలు, గృహంలో ఉన్న వస్తువులు, వ్యవసాయం, అడవి వారు చూపిన ఆదరణ మధుర క్షణాలుగా మిగిలిపోయాయని ఆనందం వ్యక్తం చేశారు. అదే సమయం లో గిరిజనుల వెనుకబాటుతనం వారిని కలిసి వేసిందన్నారు. వ్యవసాయంలో వెనుకబాటుతనం, అటవీ ఫల సాయాల మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం, అక్షరాస్యత తక్కువ, దీనికి ప్రధాన కారణంగా విద్యార్థులు కనుగొన్నారని తెలిపారు. అత్యంత స్వచ్ఛంగా వారు ఆహ్వానించిన తీరులో మానవ సంబంధాల ముద్ర విద్యార్థులపై పడిందన్నారు.

చాపరాయి వద్ద వారి ఆనందానికి ఆకాశమే హద్దుగా మారిందని తెలిపారు. ట్రైబల్ మ్యూజియానికి వెళ్లడం, థింసా నృత్యం చేస్తున్న బృందంతో కలిసి విద్యార్థులందరూ థింసా ఆడారన్నారు. మ్యూజియంలో గిరిజన జీవనశైలిని ప్రతిబింబించిన ప్రదర్శనశాలలో ఈ సహజత్వాన్ని చూసి అచ్చెరువొందారని తెలిపారు. 4వ రోజు చివరి రోజు విద్యార్థులు వారి సమస్యలు పరిష్కారానికి, వారి చదువు ఎందుకు అవసరం, సమాజానికి విద్యార్థి నాయకులు, రోటరీ, లయన్స్ వంటి సంస్థల సేవా కార్యక్రమాలు, రాజకీయ పోరాటాలను తెలియజేసినట్లు చెప్పారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ లక్ష్యాలు, బాలల కోసం చేస్తున్న కృషి, వివిధ కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు. అనంతరం వచ్చిన విద్యార్థులు జోన్ వారీగా చర్చించి విసి ఆఫ్ విసిసి ఏం చేస్తారు అనే ప్రణాళికను ప్రెజెంట్ చేసారన్నారు.

ప్రకృతి ఒడిలో రుచికరమైన భోజనంతో పాటు ఊటీని తలపించే శారదానికేతన్‌లో జరిగిన ఈ క్యాంపు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు మంచి పౌరులుగా తయారు చేస్తుందన్నారు. శారదా విద్యానికేతన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. క్యాంపునకు ఆర్థికంగా సహాయం అందించిన సంస్థలు, వ్యక్తులకు ధన్యవాదాలు తెలిపారు. విసిసి మీద నమ్మకంతో పిల్లలను పంపించిన తల్లిదండ్రులకు, వారిని తీసుకొనివచ్చిన ఆర్గనైజర్లు, వాలంటీర్లకు జేజేలు పలుకుతున్నామన్నారు. విసిసి ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ ఆధ్వర్యాన ఈ కార్యక్రమానికి జోన్ నాయకులు కొండమ్మ, అప్పారావు, గీతాంజలి, విజయలక్ష్మి, కృష్ణారావు, మణి, లక్ష్మి, అశ్విని వాలంటీర్లు గుణ శంకర్, శశి కుమార్, హరిత, సాయికుమార్, రష్మిక, జగదీష్, శ్రావణి, నిఖిల్, సూర్య, తనూజ, అఖిల్, అభి, భరత్, వర్షిని, దీపిక, సుమతి, సంధ్య, హారిక నాయకత్వం వహించారు.



విద్యార్థులతో కలిసి బొర్రాగుహలకు చేరుకున్న బృందానికి స్వాగతం పలుకుతున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు


బొర్రా గుహలను చూస్తున్న పిల్లలు


పిల్లలకు ఆటలాడిస్తున్న బృందం సభ్యులు


తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. బుధవారం సుంకపూర్ గ్రామంలో సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది కార్యాలయానికి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు హాజరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ధృవపత్రాలు అందజేయాలని సూచించారు.


పట్టుబడిన వాహనాలతో పోలీసులు

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలో 47 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల సిఐలు విజయకుమార్, అప్పన్న, నాలుగు మండలాల ఎస్ఐ ల ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు లేనందున 47 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ విజయ్ కుమార్ వెల్లడించారు. వీటిలో 45 టూ వీలర్స్, ఒక కారు, ఒక ఆటో ఉన్నట్లు తెలిపారు. వాహనదారులు రికార్డులు సమర్పిస్తే వాటిని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌కు పంపిస్తామని, రికార్డులు పక్కాగా ఉన్న వాహనాలను వాహనదారులకు అందజేస్తామన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా వెహికల్ రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్డెన్ సెర్చ్‌లో నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, కోట ఊరట్ల మండలాల ఎస్ఐలు గపూర్, విభూషణరావు, రామారావు ,రామకృష్ణ పాల్గొన్నారు .

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో దొండపూడి, మత్స్యవానిపాలెం గ్రామాలలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలోఎస్సై లక్ష్మణరావు సర్కిల్ పరిధిలో సిబ్బంది పాల్గొని బుధవారం తెల్లవారుజాము నుంచే ముఖ్యమైన కూడళ్ళు, గ్రామ శివార్లకు వెళ్ళి వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేని 34 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్, రెండు కారులను స్వాధీనం చేసుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ అప్పల నాయుడు మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలు వెలువడే సమయం దగ్గర పడుతున్నందున గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పరిధిలో కొత్తకోట, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట ఎస్సైలు లక్ష్మణరావు, సురేష్, ధనుంజ యనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు..

వంతెన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి పంచాయతీ పెద్దూరు మాలింగువలస గ్రామాలకు ఆనుకున్ని రోడ్డు వంతెన నిర్మాణ పనులకు గిన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఇ సుబ్బారావు మాట్లాడుతూ, పంచాయతీ పరిధి పెద్దూరు నుండి పెదబయలు మెయిన్ రోడ్డు ఆనుకుని ఉన్న గ్రామాల రింగ్ రోడ్డు వంతెన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో బీటీ రోడ్డు నిర్మాణానికి పనులు చేపడతామన్నారు.

పాఠశాలలు తెరిచిన వెంటనే

పుస్తకాలు పంపిణీ చేయాలి

డిఇఒ వెంకటమహాలక్ష్మమ్మ

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎమ్.వెంకట మహలక్ష్మమ్మతో పాటు ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు పరిశీలించారు. విద్య కానుకకు సంబంధించిన రిజిస్టర్‌ను పరిశీలించారు. స్థానిక ఎంఈఓ కె.నరేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు 1 వ తరగతి నుండి 7 వ తరగతి వరకు 52 శాతం, 8 నుండి 10 తరగతి వరకు 72 శాతం పుస్తకాలు వచ్చాయని డిఇఓకు ఎంఈఓ నరేష్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌ను పాఠశాల తెరిచిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పుస్తకాల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలన్నారు. మిగిలిన పుస్తకాలు త్వరలోనే వస్తాయన్నారు. పదవ తరగతి సిలబస్ సిలబస్ పూర్తిగా మారిందని,కొత్త సిలబస్ పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ,విద్యార్థులకు ఉత్తమ బోధన అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంఈఓ కు సూచించారు.


స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న డిఇఒ

టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఇఒ

నక్కపల్లి:నక్కపల్లిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎమ్. వెంకట మహలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు జరుగు తీరును ఛీఫ్ సూపరింటెండెంట్ సుందరరావు, డిపార్ట్మెంట్ ఆఫీసరు కె.వి.సూర్యనారాయణ, ఏడిఓ ఎన్.వి.ఎస్.ఆచార్యులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణమంతా మొబైల్ జోన్‌గా పరిగణించాలని సూచించారు. ఉపవిద్యాశాఖాధికారి పి.అప్పారావు కూడా పరీక్షా తనిఖీ చేశారు.